ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు 50 బృందాలు

- వేగం పెంచిన అధికారులు
- మరో 10 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యం
- రోజుకు 2,500 మందిని సర్వే చేయాలని నిర్ణయం
- ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు





బంజారాహిల్స్ రోడ్ నం.12లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సిబ్బంది

బంజారాహిల్స్: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక ప్రక్రియ మందకొడిగా సాగుతున్న తరుణంలో మరింత వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట తదితర నాలుగు డివిజన్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని భావించారు. సర్కిల్‌లో మొత్తం 28,421 మందిని ఈ పథకం కోసం ఎంపిక చేశారు. ఐదురోజుల క్రితం సర్వే ప్రారంభం కాగా 12 బృందాలను నియమించి ప్రత్యేక యాప్ ద్వారా అర్హుల వివరాలను అందులో పొందుపరుస్తున్నారు. అయితే రోజూ ఒక్కో బృందం 5–10 మందిని మాత్రమే సర్వే చేస్తుండడంతో ఇప్పటి వరకు 10 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో సోమవారం నుంచి మరో 18 మందిని పెంచి 30 మందితో సర్వే చేస్తున్నారు. అప్పటికీ అనుకున్న గడువులోగా సర్వే పూర్తయ్యే అవకాశాలు కనిపించకపోవడంతో మొత్తం 50 బృందాలు ఏర్పాటు చేయాలని తలపెట్టారు. మంగళవారం నుంచి 50 బృందాలతో సర్వే చేపట్టనున్నారు. ప్రతి రోజూ 50 బృందాలు 2,500 మందిని సర్వే చేసే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకు 4,030 మందిని మాత్రమే సర్వే చేయగలిగారు. ఇంకో 24,000 మందిని సర్వే చేయాల్సి ఉండగా గడువు ముంచుకొస్తుండడంతో బృందాలను పెంచారు. అయితే సర్వే చేసే మహిళను ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరిచే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సర్వే చేస్తున్న సిబ్బంది వాపోతున్నారు. ఈ సర్వే ఆషామాషీగా లేదని, పకడ్బందీగా ఎన్నో వివరాలను నమోదు చేయాల్సి ఉందని, వీటిని యాప్‌లో నమోదు చేసే క్రమంలో కూడా చాలా సమయం తీసుకుంటుందని సిబ్బంది అంటున్నారు. మొత్తానికి మరో రెండు వారాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేసే దిశలో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మరి కొన్ని చోట్ల ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో మరో రోజు వెళ్లాల్సి వస్తుంది. చాలామంది ఉదయమే బయటకు పనులకు వెళ్తుండడంతో సర్వే చేస్తున్న సిబ్బందికి వారు అందుబాటులోకి రావడం లేదు. సర్వే మందకొడిగా సాగడానికి ఇది కూడా ఒక కారణంగా సిబ్బంది పేర్కొంటున్నారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్‌గుప్తా, నర్సింహారావు

చిక్కడపల్లి: ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టి ఆదరిస్తే మానవ జన్మకు సార్థకత లభిస్తుందని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్‌గుప్తా అన్నారు. సోమవారం చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం, అన్నదాతలు ప్రొద్దుటూరు నర్సింహారావు, సహదాత వీఎస్ నాగరాజు ఆధ్వర్యంలో కార్మికశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారి తొడుపునూరి రవీందర్‌గుప్తా, ఐపీపీ సింగారపు రమేశ్‌గుప్తా, బాలచందర్, శ్రీనాథ్, మామిండ్ల శ్రీనివాస్‌గుప్తా, కేవీపీ ప్రసాద్, సంగారపు శంకర్, వెంకట సుబ్బయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



బాపూజీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించిన యూసీడీ వసంత

ముషీరాబాద్: ప్రజాపాలనలో సొంత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించేందుకు యూసీడీ, రెవెన్యూ అధికారులు సోమవారం ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లో సర్వే చేశారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులు, సొంత ఇల్లు కాదా, తదితర వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. యూసీడీ అధికారి వసంత మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 900 దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. అర్హులైన వారి వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఎగ్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



బీసీ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్.కృష్ణయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీసీ విద్యార్థుల సమస్యలపై చైతన్యవంతమైన పోరాటం చేస్తున్న రంగారెడ్డి జిల్లా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్‌ను సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఘనంగా సన్మానించారు. ప్రతి విద్యార్థి నాయకులు బీసీ సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. జనవరి 3వ తేదీన జరిగే జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని విజయవంతం చేయాలని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, నీలా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



ఎల్ఐజీలో డ్రైనేజీ మరమ్మతులు చేపడుతున్న వాటర్ వర్క్స్ సిబ్బంది

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీ క్వార్టర్స్‌లో కొంత కాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించామని కార్పొరేటర్ కె. రవిచారి తెలిపారు. స్థానిక ఫిర్యాదుల మేరకు వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ మేనేజర్ జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కుకు బెస్ట్ క్లబ్ అవార్డు



అవార్డును అందుకుంటున్న అధ్యక్షుడు వివేక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కులోని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్‌కు బెస్ట్ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ 301 అవార్డు లభించింది. సోమవారం జరిగిన వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సదస్సులో ఈ అవార్డును క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు కందూరి కృష్ణ, మురళీకృష్ణ, సంపత్‌రెడ్డి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కేంద్రం కృషి



చిక్కడపల్లిలో మహిళలు ఉచిత శిక్షణ శిబిరాన్ని సందర్శిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: మహిళలు స్వయం సమృద్ధితో ఆర్థికంగా ఎదగాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లిలోని మహిళాభవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నివి చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణా శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. మహిళలు ఉచిత శిక్షణా శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వీటిని అర్హులైన వారు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న భక్తులకు వైకుంఠద్వార దర్శనం

కాచిగూడ: జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయాల్లో భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కలిగించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ హైదరాబాద్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉమ్మిగారి రమేష్ తెలిపారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ బాలాజీ మందిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ద్వారా దర్శనం జనవరి 10వ తేదీన తెల్లవారు జామున 3.30 గంటలకు ప్రారంభమై అర్ధ రాత్రికి ముగుస్తుందన్నారు. జనవరి 10, 11, 12 తేదీల్లో మూడు రోజులపాటు వైకుంఠ ద్వారా దర్శనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పురాణం ప్రకారం శ్రీ మహావిష్ణువు వైకుంఠంలో ఉండే ఒకరోజు భూమిపై ఒక సంవత్సరంగా పరిగణించబడుతుందన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులు తమ వాహనాలను నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ చేయాలన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం రోజు దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు

లిబర్టీ: దివ్యాంగులపై వివక్ష చూపుతున్నారని దాన్ని విడనాడాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కే.బి.శ్రీధర్‌లు అన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నప్పటికీ ఏ రంగంలో సరైన ప్రాధాన్యత లేదని ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. వరల్డ్ డిసబుల్‌డేను పురస్కరించుకొని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో దివ్యాంగులకు వాటా, కోటా దక్కాలన్నారు. దివ్యాంగులకు రాజకీయ ఆర్థిక సాధికారిత కల్పించాలన్నారు.

'తీరం చేరని కెరటాలు' కవితా సంపుటి ఆవిష్కరణ

కాచిగూడ: జీవిత సారాంశాన్ని డాక్టర్ చిలుక భాస్కర్ తన రచనల ద్వారా సమాజానికి విపులంగా తెలియజెప్పారని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. చిలుక బ్రదర్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందికొట్కూర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ చిలుక భాస్కర్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ చిలుక భాస్కర్ రచనలో వెలువడిన 'తీరం చేరని కెరటాలు' కవితా సంపుటిని కోదండరామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి అందరు మెచ్చిన కవిగా రాణించడానికి తెలుగు భాషపై మంచిపట్టు సాధించారని అన్నారు. కరోనా సమయంలో ఆయన రాసిన కవిత అందరినీ ఆకర్షించిందన్నారు.

'లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం వృథా'

కాచిగూడ: లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం లూటీ చేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఈడీని కోరారు. ఈ మేరకు సోమ వారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఓఆర్ఆర్ టోల్ లీజును ఐఆర్‌బీ సంస్థకు ఇవ్వడంలో, వరంగల్, రంగారెడ్డి కైటెక్స్ యూనిట్ల స్థాపనలోనూ అక్రమాలు జరిగాయన్నారు. క్విడ్‌ప్రోకో పద్ధతిలో ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు టెండర్ లేదా లీజు అగ్రిమెంట్ అయిన వెంటనే బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చాయని, ఆ వెంటనే బీఆర్ఎస్ ఆ బాండ్లను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకున్నదని ఆరోపించారు. అప్పటి పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ఈ క్విడ్‌ప్రోకో తతంగంతో నేరుగా ఒప్పందం ఉందన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



విద్యుత్ బీసీ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్లు కల్పించాలని.. బీసీ రిజర్వేషన్‌లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల 19వ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను, 2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు జనవరి 11వ తేదీన తిరుపతిలో జరగనున్నాయని ఈ మహాసభలను విజయవంతం చేయాలని విద్యుత్ బీసీ ఉద్యోగులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితా పాల్గొంటారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నందగోపాల్, వేముల రామకృష్ణ, రఘుపతి, సుదాకర్, కె.సతీష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

'తపన ఉంటేనే మంచి సాహిత్యం వస్తుంది'



సంపుటిలను ఆవిష్కరిస్తున్న బైస దేవదాసు, వెంకట మాధవీ లత, వంశీరామరాజు

చిక్కడపల్లి: తపన ఉంటేనే మంచి సాహిత్యం వస్తుందని అని నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీత్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికపై వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా నిర్వహణలో 'వెలవెల తెలుగు వెన్నెల'కార్యక్రమాల్లో భాగంగా ఖతార్‌లోని దోహాలో స్థిరపడిన తెలుగు రచయిత్రి డాక్టర్ వెంకట మాధవీలత జిలుగు రచించిన లలితా వల్లరి కవితా సంపుటి లలితా మాధవీయం పద్య శతకం ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా దేవదాసు పాల్గొని సంపుటిలను ఆవిష్కరించి మాట్లాడారు.

◆ దేశాంతరాన ఉన్నప్పటికీ మాధవి తెలుగు అక్షరంపై ప్రేమ తపనతో కవితలు, పద్యాలు రాశారని పేర్కొన్నారు. ప్రతి కవితలో హృదయ స్పందన కనిపిస్తోందని వివరించారు. అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు మాట్లాడుతూ.. దోహాలో తెలుగు భాష సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో మాధవి తన రచనలతో తన వంతు కృషి చేస్తున్నారని చెప్పారు. వేదికపై రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధాదేవి సంపుటిలోని అంశాలు సమీక్ష చేశారు. ఉగాండాలో స్థిరపడిన బూరుగుపల్లి వ్యాస కృష్ణ, శామీర్ జానకి, జ్యోతి, శ్రీనివాస్ గూడూరు(అమెరికా), శైలజ సుంకరపల్లి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించాలి



అవగాహన యాత్ర చేస్తున్న బృందం

పంజగుట్ట: దివ్యాంగులను సర్వాంగులతో సమానంగా చూడాలని చెబుతున్నారనే తప్ప ఆచరణలో చూపడం లేదని సంఘటి ఫౌండేషన్ ట్రస్టీ సుధీర్ ధీర్ అన్నారు. దివ్యాంగులపై అవగాహన కల్పించేందుకు సంఘటి ఫౌండేషన్ ప్రతినిధులు దేశవ్యాప్త యాత్ర చేస్తున్నారు. వీరి యాత్ర సోమవారం హైదరాబాద్‌కు చేరుకోవడంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ సుధీర్ ధీర్ మాట్లాడుతూ డిసెంబర్ 15వ తేదీన ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఆరుగురు సభ్యులతో ఈ యాత్రను ప్రారంభించామన్నారు. మొత్తం 12 రాష్ట్రలను ఎంపిక చేసుకొని యాత్ర సాగించామన్నారు. జనవరి 3వ తేదీన ఢిల్లీలో యాత్ర ముగుస్తుందన్నారు. మొత్తం 7 వేల కిలోమీటర్లు నాలుగు ప్రత్యేకంగా తయారు చేయించిన మోటార్ సైకిల్, ఒక కారులో యాత్ర సాగిందన్నారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం ప్రతీచోట దివ్యాంగులు, సీనియర్ సిటీజన్స్ వెళ్లేందుకు మెట్లతో పాటు ర్యాంప్ కూడా ఉండాలని, ప్రతీ హోటల్‌లో లిఫ్ట్ ఎక్కాలంటే ముందుగా కొన్ని మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని, అక్కడ ర్యాంప్ లేకపోవడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కేవలం హోటల్స్‌లో కాకుండా పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, షాపింగ్ మాల్స్ అన్నిచోట్ల దివ్యాంగులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై దివ్యాంగ కమిషనర్‌కు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

సమసమాజ స్థాపనకు పోరాడాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమసమాజ స్థాపన కోసం విద్యార్థులంతా పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ... 1970 డిసెంబరులో కేరళలోని త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందన్నారు. విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలను సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ దేశంలో అతి పెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నామని అన్నారు. ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ సంస్థలను దెబ్బతీస్తూ ప్రైవేటు విద్యారంగ సమస్థలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, జిల్లా కార్యదర్శి జావేద్, లెనిన్, స్టాలిన్, శ్రీమన్, నాగేందర్, ప్రశాంత్, సహన, చరణ్‌శ్రీ, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవానికి పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎం.శ్రీనివాస్

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల ప్రతినిధులు

కాచిగూడ: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్రమంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు.అమిత్ షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. అయన దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకుని కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నేత వలీ ఉల్లాఖాద్రీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు, సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు తేజ, సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

చిత్రపురికాలనీ బాధితులకు ఆప్ అండగా ఉంటుంది

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్



డాక్టర్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మద్దినేని రమేష్ బాబు

కవాడిగూడ: చిత్రపురికాలనీలో జరిగిన అక్రమాలను అరికట్టి బాధితులకు న్యాయం జరిగే వరకు ఆప్ తెలంగాణ కమిటీ అండగా ఉంటుందని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. వారి మీద చర్యలు తీసుకొని చిత్రపురికాలనీ సభ్యులకు న్యాయం చేయాలని సోమవారం సినీ దర్శక నిర్మాత ఫిలిం డివిజన్ ప్రజానాట్య మండలి కార్యదర్శి మద్దినేని రమేష్‌బాబు సోమవారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. చిత్రపురికాలనీలో జరిగిన అవినీతి అక్రమాలకు సంబంధించి గతంలో కోఆపరేటివ్ అధికారులుగా పనిచేసిన వారందరికి సంబంధాలు ఉన్నాయని అన్నారు.

◆ ఈ సందర్భంగా డా. సుధాకర్ మాట్లాడుతూ... చిత్రపురికాలనీలో 2005 నుంచి 2015 మధ్యలో ట్యాంపరింగ్, 129 మార్ఫింగ్ అలాట్‌మెంట్స్, 1055 ఎలక్ట్రానిక్స్ సభ్యత్వాలు, 250 ఫొటోస్ లేని ఓటర్ల జాబితాలు, కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయన్నారు. వీటిని బయటపెట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. వినోదాన్ని పంచే సినీ కార్మికులకు న్యాయం జరిగే వరకు ఆమ్ ఆద్మీ పార్టీ అండగా ఉంటుందని హామీని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆప్ యువజన విభాగం అధ్యక్షులు విజయ్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి యమునాగౌడ్, డాక్టర్స్‌వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్యానాయకుడు, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో బేడ బుడగ జంగాలకు ప్రాధాన్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిరిగిరి మన్నెం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎస్సీ వర్గీకరణలో బేడ బుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలని బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్నెం కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బేడ బుడగ సంఘాల పోరాట సమితి 23వ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా సిరిగిరి మన్నెం మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నా బేడ బుడగ జంగాలకు తగిన న్యాయం జరగలేదన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో ఎస్సీ 59 కులాలలో బుడగ జంగాల కాలం ఒకటి ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం రావాల్సిన హక్కులు రిజర్వేషన్ ఫలాలు దక్కటం లేదన్నారు. గతంలో సర్టిఫికెట్ల కోసం అనేక ఉద్యమాలు చేశామన్నారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక ఆర్థిక రంగాలలో బేడ బుడగ జంగాలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు కోడిగంటి నర్సింహ, కడమంచి సహదేవుడు, నిడుగొండ కృష్ణయ్య, సి. శ్రీనివాస్, తూర్పాటి శ్రీనివాస్, గడ్డం మల్లికార్జున, మోతె రాములు, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మిస్ సౌత్ ఇండియా విజేతగా శ్రీతేజ

ముషీరాబాద్‌కు చెందిన శ్రీతేజకు అభినందనల వెల్లువ



శ్రీతేజను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ తన కలను నెరవేర్చుకునేందుకు విద్యార్థిగా చదువుకుంటూనే మిస్ సౌత్ ఇండియా పోటీలో విజయం సాధించింది. ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన జ్యోతి, వినయ్‌కుమార్‌ల కూతురు వి.శ్రీతేజ నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు చిన్నచిన్న పనులు చేస్తూ జీవనోపాధి పొందుతూ తన కూతురిని బాగా చదివించడంతో పాటు సమాజంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా ప్రోత్సహిస్తూ పెంచారు. ఆమె తల్లి జ్యోతి ల్యాబ్ టెక్నీషియన్‌గా ఓ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తుండగా తండ్రి వినయ్‌కుమార్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ తన కటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీతేజ చదువులో రాణించడంతో పాటు వెబ్ సీరిస్, షార్ట్ ఫిలిమ్స్‌లలో నటిస్తూ మిస్ యూనివర్స్ పోటీలకు సంసిద్ధమవుతోంది. ఈనెల 21న ఢిల్లీలో మిస్ సౌత్ ఇండియా పోటీలు జరగగా అందులో పాల్గొన్న శ్రీతేజ తన ప్రతిభను కనబర్చి మిస్ సౌత్ ఇండియా–2024 ప్రైడ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని తన ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీవాసులు, వివిధ పార్టీల నేతలు ఆమెను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ గంగపుత్ర కాలనీలోని శ్రీతేజ ఇంటికి వెళ్లి అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో మిస్ యూనివర్స్ పోటీల్లో విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, పూస గోరఖ్‌నాథ్, శశిముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.